జులుం

-కే.వస్వ

చూడగానే అనిపించింది, వీడు పోలీ సోడని. రిక్షా గంగులు అమాత్రం తెలివిలేని వాడు కాదు. ఖర్మరా తండ్రీ అనుకుంటూనే అతణ్ణే ఎక్కించుకున్నాడు. నల్ల బూట్లు ఖాకీ ప్యాంటు తలకి 'పోలీసు కటింగ్'... అంతేకాదు మాటల్లో వెలాయించిన పోలీసు దర్జా...

అందుకే—ఎక్కడికి పోవాలండీ అనికూడా అడగలేదు గంగులు.

చిరచిరలాడే ఎండలో యూనివర్సిటీ రోడ్డంతా తొక్కాడు. అప్పటికే అలసటొచ్చేసింది. క్వార్టర్స్ దగ్గర ఆపించి 'ఇప్పుడే వస్తామండు' అని వెళ్ళినవాడు ముప్పావుగంట తర్వాత వచ్చాడు.

ఏ ఇంట్లో ఏ రాచకార్యం చక్కబెట్టే వచ్చాడోగాని మళ్ళీ రిక్షా ఎక్కి "శ్రీనివాస మహల్ దగ్గరికి పోనీ" అన్నాడు.

వెళ్ళినంత దూరమూ మళ్ళీ తొక్కి చిన్న బజారు వీధంతా తిరిగి వొగర్చుకుంటూ శ్రీనివాసమహల్ దగ్గరికొచ్చాడు.

అయ్యగారికి పని సరిగ్గా అక్కడంటే అక్కడే కాదు, ఎదుటి వీధిగుండా వెళ్ళి రెండో సందు దగ్గర ఆపించి దిగి వెళ్తూ మళ్ళీ "ఇప్పుడే వొచ్చేస్తా" అన్నాడు.

నీరసం వచ్చేసింది గంగులుకి.

"బాబూ...నేనెల్ పోతానండి...గుడిసెకెల్లాల" అన్నాడు నోరు పెగుల్చుకుని.

"ఆ...వుండమంటే..." అంటూ తిరిగి చూసి గుడ్లురిమాడు అతను.

వచ్చినట్టు అక్కడే పడున్నాడు గంగులు.

"ఈ పోలీసోడికి ఏం పనిబడిందోగాని నా ప్రాణానికొచ్చిపడింది" అని తిట్టుకున్నాడు.

మరో పావు గంటకి సందు నుంచి బైటపడ్డ పోలీసు ఉస్సురుమంటూ రిక్షాలో కూలబడ్డాడు.

నెహ్రూ వీధికి వెళ్ళమన్నాడు.

అక్కడ వో కొట్లో కెళ్ళి యజమానితో ఏదో మాట్లాడాడు. ఎవరికో ఫోన్ చేసి చాలాసేపు ఏదేదో చెప్పాడు.

తర్వాత షాపు యజమానితోబాటు వీధి చివరి దాకా వెళ్ళొచ్చాడు. అక్కడ ఇద్దరూ కూల్ డ్రింక్స్ తాగారు.

పోలీసాయన వచ్చి దభేల్ మని కూచున్నాడు రిక్షాలో...

కుతకుత లాడిపోతున్నాడు గంగులు.

"మా యజమానికి వొంట్లో బాలేదండి. నేనెల్లి ఆస్పత్రికి దీసకపోవాల" అన్నాడు నసుగుతూ.

"తొరి" అంటూ పెడెల్ మని గంగులు కూచున్న సీటుని బూటు కాలితో తన్నాడతను.

"పోనీరా నీ.." అంటూ బండ బూతు తిట్టాడు.

పట్టరాని కోపాన్ని అదుపు చేసుకుంటూ ఎక్కి నీరిగి తొక్కుతున్నాడు. పెడల్ కూడా నీరసంగా మూలుగుతోంది. ఆయాసం వచ్చిన చైన్...పళ్ళ చక్రంలో స్లిప్ అవుతూ పెటపెట మని శబ్దం చేస్తోంది.

మళ్ళీ బజారు రోడ్డు తిప్పించి క్రైం స్టేషన్‌కి వెళుతున్నాడు. ఆ దారి అంతా ఎగుడు. తొక్కుతుంటే గుండెల్లోకి గస తన్నుకొచ్చింది. స్టేషన్ దాకా వెళ్ళేలోగానే సర్రున రిక్షా దిగేశాడతను. "అరె— వుండ్రా..." అంట చరచరమని స్టేషన్‌లోకెళ్ళి పోయాడు.

వెంటనే ఎటైనా వెళ్ళిపోదామనుకున్నాడు గంగులు.

కాని వీలుపడదు.

రెండ్రోజుల్లోనే అతనికి ఎక్కడో ఎదురుపడచ్చు. అప్పుడు—బొత్తిగా బావుండదు.

మళ్ళీ పోలీసు మరి కాస్సేపట్లోనే వచ్చి రిక్షాలో కూలబడ్డాడు. ఈసారి కాస్త రిలాక్స్‌డ్‌గా వున్నాడు. "పదరా—ఇంటికెళ్దాం" అన్నాడు.

"ఏదో మనింటికెళ్దాం" అన్నంత సౌమ్యంగా వచ్చింది మాట.

సూర్యుడు నడి నెత్తికెక్కి దిగుతున్నాడు.

ఆయాసం కూడా పుట్టి చచ్చి ఓపిక హరించిపోయిన దశలో కదులుతున్న శవంలా రిక్షా తొక్కుతున్నాడు గంగులు.

ఇంకో పావుగంటకి...రిక్షా ఆపించి ఇంటి ముందు దిగాడు అతను.

"పోన్లే వద్ద శ్రమకి ఈపూట నాలుగు రూపాయలైనా వస్తాయి" అనుకున్నాడు గంగులు.

నిజానికి వరసగా అన్ని దూరాల బేరాలు ఏ రిక్షావాడూ ఒప్పుకోడు. న్యాయంగా అన్ని బేరాలకు కలిపితే పదిహేను రూపాయిలైనా ముదుతుంది.

పోలీసు బేరంలో అంత ఆశించడం కుదర్దు కాబట్టి...ఐదు రూపాయిలు...పోనీలే...నాలుగైనా వస్తాయనుకున్నాడు గంగులు.

అతని ఆలోచనలో తప్పు ఉండవచ్చని అతనికి తోచలేదు.

ఇంతసేపూ రిక్షాలో దర్జాగా వూరేగిన రక్షక భటుడు మరీ అంత అన్యాయస్థుడేం కాదు.

దిగీ దిగగానే జేబులోంచి పర్సు తీశాడు. పర్సులోకి చూసి చూసి "అరె—చిల్లర్లేదురా" అన్నాడు.

"ఎంతకండి—" అన్నాడు గంగులు.

ఎంతకో అతనేమీ చెప్పలేదుకాని జేబులో వేళ్ళతో వెతికి తలాడిస్తూ చెయ్యి బైటికి తీశాడు.

"ఉందిలేరా" అంటూ గంగులు చేతిలో పెట్టాడు ఒక రూపాయి బిళ్ళ.

గంగులు మాపులు మండాయి. కడుపు మండింది. వొళ్ళు మండింది. అరికాలి మంచి నెత్తికి పాకింది కోపం. "ఇదేంటి బాబూ...పదకొండప్పుడు రిక్షా ఎక్కి...యూనివర్సిటీ...మళ్ళీ రిటర్ను— నెహ్రూ వీధి... బజారు...పోలీస్ స్టేషన్...అంతా తిర్గీ...ఈ మిట్ట రోడ్డంతా తిరిగి..." అంటూ ఏకరువుబెట్టే "రూపాయిచ్చారా!" అన్నాడు ఈసడింపుగా.

"ఏంట్రా?...చాల్లా?"

"మళ్ళీ అడుగుతారేంది బాబూ..."

"అయితే తీస్కోరా నాకొడకా"

ఫెడీమంది.

ఊహించలేదు గంగులు.

లెక్క పెట్టినట్టు కొట్టాడతను దవడ మీద. గంగులు నిలదొక్కుకుంటూ రిక్షాను పట్టుకున్నాడు.

నడుము మీద పడిన బూటు కాలు డొక్కలో దిగింది. ప్రాణం విలవిలలాడిపోగా కుప్పగూలాడు గంగులు.

"రిక్షా నాకొడుక్కి ఇంత పొగరేందిరా... అంతే ఇచ్చేది నీకు...ఏం జేస్తావ్? ఏం చేస్తావ్‌రా నువ్వు... దొంగ లంజకొడకా!..." అంటూ మాట మాటకీ తన్నాడు. "కనిపిస్తే కాల్చేస్తారా నా కొడకా...పో ఇక్కణ్ణుంచి..." ఈడ్చి ఇంకోసారి తన్ని వెళ్ళిపోయాడు.

భయంతో వణికిపోయాడు గంగులు.

వెళ్ళినవాడు మళ్ళీ ఇంట్లోంచి వచ్చి తంతాడేమో అని కూడా భయమేసింది.

శక్తి కూడదీసుకుంటూ రిక్షా తోసుకుని వచ్చాడు. ఆ తర్వాత నెమ్మదిగా పెడలేస్తూ వూళ్ళో కొచ్చేశాడు.

అతని పిడికిళ్ళు మాటిమాటికి బిగుసుకుంటున్నాయి. తన్నులు తింటూ విన్నమాట చెవుల్లో రింగుమని మారుమోగింది.

రిక్షా నాకొడుకు—ఎవర్ని ఏం చెయ్యగలడు? ఏమీ చెయ్యలేడా?

* * *

బస్ స్టాండు.

ఖాళీ రిక్షా ఎదురు చూస్తోంది బేరం కోసం.

రిక్షా గంగులు ఎదురు చూస్తున్నాడు సరైన బేరం కోసం.

అతని మనసు ఇంకా కసితో కోపంతో ఊగిపోతోంది.

ఎవర్నీ ఏం చెయ్యలేడా?

రిక్షా నాకొడుకంటే ప్రతివాడికీ అలుసేనా?

అప్పుడే ఆగిన బస్సులోంచి ఆపసోపాలు పడుతూ దిగుతున్నారు పాసెంజర్లు.

లగేజీతో దిగిన ఇద్దరు నడివయసు మనుషుల్ని చూడగానే "వీళ్ళూ సరైన బేరం" అనుకున్నాడు గంగులు.

సాటి రిక్షా వాళ్ళ నుంచి చాలా కథలు విన్నాడు గంగులు. కాని ఎప్పుడూ అలా ట్రిక్స్ వెయ్యలేదు.

ఇవాళ తమాషా చూడాలనుకున్నాడు.

"బాబూ...ఎక్కడికెళ్ళాలండి?" అన్నాడు దగ్గరికెళ్ళి మర్యాదగా.

నడివయసు వ్యక్తుల్లో ఒకతను జేబులోంచి కాయితం తీసి అడ్రసు సరిచూసుకున్నాడు.

"కమలానగర్...పదమూడో వార్డు...తెలుసా?"

ఆ వాలకంబట్టే తెలిసిపోయింది వాళ్ళు ఊరికి కొత్త అని. కమలానగర్ చాలా దూరం. మామూలుగా అయితే ఇద్దరికీ ఐదు రూపాయిలు న్యాయం.

అదే చెప్పాడు.

సరేనంటూ ఎక్కి కూచున్నారు వాళ్ళు.

"ఎక్కారు బడా బాబులు" అనుకున్నాడు గంగులు.

ఊరికి కొత్త కావడం కాదు, రిక్షా ఎక్కిన వాళ్ళిద్దరూ చాలా మంచి వ్యక్తుల్లా వున్నారు. ముఖ కవళికల్లోనూ మాటల్లోనూ సౌమ్యత కనిపిస్తోంది. బాగా చదువుకున్న వాళ్ళు. మంచి ఉద్యోగాల్లో వున్నవాళ్ళు. అన్నిటికీ మించి మర్యాదస్తులు.

మర్యాదస్థులంటే ఎప్పుడెప్పుడు ఎలా ప్రవర్తిస్తారో గంగులుకు తెలుసు.

గంగులు పెడల్ వేస్తుండగా వాళ్ళు మాట్లాడుకుంటున్నారు. ఆ మాటల్ని బట్టి వాళ్ళ మనస్తత్వం చాలా సున్నితమని కూడా గ్రహించాడు.

మర్యాద మనుషులు. సున్నితమైన మనుషులు. ఫర్లాంగు దాటిన తర్వాత చిన్న బజారు వీధిలోకి మళ్ళాడు గంగులు.

"అరె—అదేంటి...ఇలా వెళ్తున్నావే" అన్నాడు పాసింజర్లలో ఒకతను.

"అవునూ...కమలానగర్ అంటే బ్రిడ్జి అవతల అన్నట్టు గుర్తు...ఇలా వెళ్తున్నావేంటి?"

ఠక్కున ఆగిపోయాడు గంగులు.

"బాబూ...మీరెళ్ళాల్సింది కామరాజ్ నగర్ కాదా?"

"కాదే...కమలానగర్ అని చెప్పాం కదా?"

"ఎక్కడ చెప్పారు బాబూ... పేపర్ కాయితం చూసుకుని కామరాజ్ నగర్ అనే చెప్పారు. ఇంకోసారి చూసుకోండి"

పాసింజర్లు నిజంగా కన్‌ఫ్యూజ్ అయిపోయారు. అడ్రెస్ చూసుకుని మళ్ళీ చెప్పారు "కమలానగరే. ..అలాగే చెప్పాం ఇందాక కూడా. అసలు కామరాజ్ నగర్ అంటూ వొకటుందని కూడా నాకు తెలీదే.. .తిప్పు రిక్షా..."

"తిప్పుతామగానండి. ఇంకో పది ఎక్కువవుద్దండి..."

"ఇంకో పదా?..." నోరెళ్ళబెట్టేశాడు.

"ఇదెక్కడి అన్యాయం..."

"అవునండి...కమలానగరంటే రెండు మైళ్ళుంది. అంతా అప్పే!...రిటర్న్ బాడి గుండదు...పదైదు ఇవ్వకుంటే దిగెయ్యండి."

వీడితో ఎందుకనుకుంటూ దిగబోతున్నారు.

"కాని నా పది నాకిచ్చెయ్యండి."

"నీ పదేంటి? అసలు మనం మాట్లాడిందే అయిదు కదా?"

"అవునయ్యా. కమలానగర్ అని అయిదు రూపాయిలకి మాట్లాడాం. కామరాజ్‌నగర్ అని నువ్వేంటే మాట్లాడుతన్నావు...దిగిపోతామంటే...పది ఎందుకు? అసలు అయిదయినా ఎందుకివ్వాలి? ...బస్‌స్టాండ్ నుంచి ఆ టర్నింగ్ తిరిగాం అంతేగా?..."

ఈలోగా చుట్టూ జనం మూగారు. కొందరు దారంట వెళ్తూ ఆగి చూస్తున్నారు.

జనాన్ని చూసి పాసింజర్లు కాస్త బెరుకుగా ఫీలయ్యారు. అందర్లో రిక్షా వాడితో గొడవ పడ్డ అవమానం.

అదే జనాన్ని చూసి గంగులు రెచ్చిపోయాడు.

అతనికేం మర్యాద లేదు. మర్యాద పోతుందన్న భయం లేదు.

సడెన్‌గా గొంతెత్తి నోటినిండా వచ్చిన అబద్ధం చెప్పాడు గంగులు..."అడ్రస్ తెలీకపోతే సరిగ్గా ఎవర్నయినా కనుక్కోవాలండీ... అరగంట నుంచి రిక్షా ఎక్కి ఆరు వీధులు తిప్పారు. ఇంకా తిరగమంటే నా వల్లకాదు. నా పది ఇయ్యండి ముందు—తియ్యండి పది—"

"మలిపోయిన మర్యాదస్తులు చుట్టూ చూస్తూ మొరపెట్టుకున్నారు "చూడండి... ఎంత అన్యాయమో...ఇప్పుడే బస్‌స్టాండ్ నుంచి వస్తూ...ఎంత అబద్ధం చెబుతున్నాడో...కమలానగరంటే ఐదిమ్మన్నాడు.. మర్యాదగా ఎక్కించుకుని ఎలా అల్లరి చేస్తున్నాడో..."

తమాషా చూడ్డానికి ఆగిన ఓ పెద్ద మనిషి అక్కణ్ణుంచి కదిలిపోతూ అన్నాడు "ఏంటో అతను చెప్పేది మీరు చెప్పేది వేరుగా వున్నాయి...మీరూ మీరే తేల్చుకోవాలి..."

ఏం తేల్చుకుంటారు మర్యాదస్తులు?

"సరే—నీ అయిదూ ఇచ్చేస్తాం...వెళ్ళు" అంటూ లగేజీ దించుకుని అయిదు రూపాయిల నోటు ఇవ్వబోయాడు ప్యాసింజర్లలో ఒకతను.

"ఐదు కాదండి...పది! పదీ ఇచ్చెయ్యంటుంటే" అన్నాడు గంగులు మొండిగా. అతనిలో పైశాచిక ఆనందం వికటాట్టహాసం చేస్తోంది.

"పదీ...ఇవ్వకపోతే?..." అంటూ అక్కణ్ణుంచి కదలబోయాడు మరొకతను.

"ఆ నీ ఇష్టమైంది చేస్కోవోయ్" అని లగేజీ అందుకోబోయాడు మొదటివాడు.

"మర్యాదగా బాడుగ డబ్బు ఇవ్వు—లేకుంటే..."

"లేకుంటే ఏంట్రా?"

"రా అంటావేంటిరా?" అంటూ దభాల్న ఆయన్ని చొక్కా పుచ్చుకున్నాడు.

హడలిపోయారు పాసింజర్లు ఇద్దరూ.

చుట్టూ జనంలోంచి ఒక్కరైనా నోరు మెదపలేదు.

జనం పట్టించుకోరని తేలిపోవడంతో రెచ్చిపోయాడు గంగులు—"రిక్షా వాడి కడుపు కొడదామనుకున్నారా...బాడిగ ఇయ్యకపోతే...వొదుల్తానా...ఇది నీ బాబుగాడి రిక్షానా?"

రెండవ ప్యాసింజర్ చప్పున పది రూపాయిలు తీసి గంగులు చేతిలో కుక్కేశాడు. "ఒదిలెయ్ బాబూ.. .పోన్లే...మా ఖర్మ..."

చప్పున వదిలేశాడు గంగులు.

పది రూపాయిల నోటు సగర్వంగా అందుకుని జేబులో కుక్కుకున్నాడు.

"రిక్షా నాకొడుకంటే ప్రతి వాడికీ శీవ్...శీవయిపోయింది. పోలీసోడికీ శీపే—ప్యాసింజర్‌కీ శీపే...ఏం జేస్తావా? ఏమైనా చేస్తామ..."

అంటూ విసురుగా వెళ్ళి రిక్షా ఎక్కి దూకుడుగా పెడల్ వేశాడు.

ఆ ప్యాసింజర్లు లగేజీ మోసుకుంటూ ఉసూరుమని వెళ్ళడం గమనించాడు.

జనం చెదిరిపోతున్నారు.

జనం పట్టించుకోరు—ఎవడికి చాతైంది వాడు చేసుకుంటాడు, అనుకున్నాడు గంగులు రిక్షాను దబాయింపుగా పోనిస్తూ.

కసి చల్లారుతున్నట్టు అతని మనసు మెల్ల మెల్లగా తేలిక పడుతోంది...